క్లుప్తంగా

నేడు 'వాసవి' కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పామర్రు: పామర్రు వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. స్థానిక బొగ్గరపు జాలయ్య సుబ్బ రత్తమ్మ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యఅతి థులుగా అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు మామిడి శ్రీనివాసరావు, జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావులు పాల్గొంటారని అన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షులుగా చిన్నం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా వూటుకూరి పిచ్చేశ్వరరావు, కోశాధికారిగా కంచర్ల వీరజనార్ధనరావు, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలుగా చిన్నం పద్మనాగ లక్ష్మీకుమారి, ప్రధాన కార్యదర్శిగా వూటుకూరి లత, కోశాధికారిగా కంచర్ల ఉషారాణి ప్రమాణ స్వీకరణ చేస్తారని తెలిపారు.

25న శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

కైకలూరు (కలిదిండి): కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు శనివారం చెప్పారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవం ఫిబ్రవరి 16 నుంచి 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. సమీక్షకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఈవో చెప్పారు.

పాస్టర్లకు గౌరవ వేతనంతో మేలు



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

ముదినేపల్లి రూరల్: మండల పాస్టర్ల సంఘ సమావేశం స్థానిక ఇమ్మానియేలు చర్చిలో శనివారం నిర్వహించారు. చర్చి పాస్టర్ వీ స్వరజన్‌రాజు ఆధ్వర్యంలో పాస్టర్ ఎంకే ఏసురత్నం అధ్యక్షత వహించగా పాస్టర్ వీ విజయకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాస్టర్లకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం ఎంతో ఉపయోగ పడుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఇతరులకు సైతం ఈ పథకాలు వర్తింపజేయాలని కోరారు. పాస్టర్ పి.పీటర్ ఆధ్వర్యంలో దేశ క్షేమాన్ని కోరుతూ ప్రార్థనలు చేశారు. సమావేశంలో సంఘ నేతలు డి.ప్రసన్నరాజు, యోహాను, రాజేష్, ఏసుదాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



చెక్కు అందజేస్తున్న డైరెక్టర్ దాసు, సర్పంచ్‌లు

పాములపాడు: మండలంలోని పాములపాడు పీఏసీఎస్ సభ్యులైన గుండపనేని నాగభూషయ్య, కాటూరి వెంకట రామయ్య ఇటీవల అనారోగ్యం మృతి చెందగా బ్యాంక్ డైరెక్టర్ చేతుల మీదగా వారి కుటుంబ సభ్యులకు శనివారం రాత్రి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ డైరెక్టర్ బొల్లవరపు దాసు మాట్లాడుతూ పీఏసీఎస్ జిల్లా చైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు అదేశాల మేరకు పీఏసీఎస్ సంఘ సభ్యులు మరణిస్తే రూ.10 వేల సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాములపాడు, నాగాపురం సర్పంచ్‌లు ప్రత్తిపాటి హర్షవర్ధన్, నాగదేశి సుబ్రహ్మణ్యం, పీఏసీఎస్ కార్యదర్శి కుమారి పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడులు

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు శివారు డొంకలో జరుగుతున్న కోడి పందేల శిబిరంపై శనివారం దాడులు నిర్వహించి ముగ్గురి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పల్లా నాగకళ్యాణి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యలమర్రు గ్రామ శివారు ప్రాంతంలో కోడిపందేలు జరుగుతున్నట్లు సమాచారం రావటంతో దాడులు నిర్వహించామన్నారు. వారి నుంచి సుమారు రూ.3 వేలు, కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగకళ్యాణి తెలిపారు. అయితే దాడుల్లో దొరికిన జూదరుల పేర్లు మాత్రం పోలీసులు గోప్యంగా ఉంచటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జూదరుల అరెస్ట్

కైకలూరు: గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్‌ఐ చల్లా కృష్ణా హెచ్చరించారు. ఆలపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల నుంచి రూ.10,130 స్వాధీనం శనివారం చేసుకున్నామన్నారు. జూదరులను అరెస్ట్ చేశామని తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పేదలు మద్దతు ఇవ్వాలి

- ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు
- ముదినేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



ముదినేపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: ప్రతిపక్షాలు ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకొని పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కోరారు. ముదినేపల్లిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలులోనికి తీసుకువచ్చి పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు పేర్కొన్నారు. దీనిని విస్మరించిన టీడీపీ అధినేత చంద్రబాబు సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాలా తీస్తున్నట్లు ఆరోపణలు చేస్తూ పేదల వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకాల వల్ల రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఇటీవలనే ప్రకటించడం ముఖ్యమంత్రి పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయాలు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇస్తూ మహిళా పక్షపాతిగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేసి, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. ఈ విధంగా 13 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలను జగనన్న కాలనీల్లో చేపట్టామన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమం ఒక్క వైఎస్సార్ సీపీ పాలనలో తప్ప మరే పార్టీలోనూ సాధ్యపడదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ సభ్యులు మరీదు నాగయ్య, జంపన కోటయ్య, కోటే ప్రవీణ్, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, మత్రివాడ వీరారెడ్డి, జాస్తి రాజేంద్రప్రసాద్, నర్రా వెంకటేశ్వరరావు, బేతపూడి వెంకటరమణ, శొంఠి నాగరాజు, లేళ్ల ఆంజనేయులు, ముంగర గోపాలకృష్ణ, బలే నాగరాజు, బోయిన రామరాజు, షేక్ అల్లాభక్షు, సోమా సత్యనారాయణ, శీలం రామకృష్ణ, సుధాబత్తుల వెంకటరమణ, వీరమల్లు కొండలరావు, పాము రవి కుమార్, మండలంలోని అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

డీఆర్‌డీఏ పీడీ శివప్రసాద్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ పీ శివప్రసాద్

గుడివాడటౌన్: పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న కృషికి లబ్ధిదారులను ఆయత్తపర్చాలని డీఆర్‌డీఏ పీడీ పీ శివప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలులో మున్సిపల్ కమిషనర్ వీ మురళీకృష్ణతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాలను ఉచితంగా ఇచ్చి మూడు దఫాలుగా రూ.లక్ష 80 వేలు నగదు, సబ్సిడీతో కూడిన సిమెంట్, ఐరన్ ఉచితంగా ఇసుక ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇంకా లబ్ధిదారులకు ఆర్థిక వనరులు సమకూర్చేందుకు ఎస్‌హెచ్ గ్రూపుల ద్వారా రుణాలు కూడా అందజేస్తున్నామన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా కృషి చెయ్యాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, పీవీ శ్రీధర్, రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్, పక్కన ఎంపీడీవో సీతామహాలక్ష్మి

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు రూ.6 కోట్లతో వసతులు ఏర్పాటు చేశామని ఎంపీపీ గోగం సురేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణ పనులపై అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఒక్క వెంట్రప్రగడ గ్రామంలో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి ఇళ్ల స్థలాల కోసం పొలం కొనుగోలు చేసినట్టు వివరించారు. గ్రామంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మికి సూచించారు. ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సుపరింటెండెంట్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాంబాబు



కంభపు రాంబాబు

పామర్రు(పమిడిముక్కల): రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా కంభపు రాంబాబు నియమితులయ్యారు. పమిడిముక్కల మండలం మంటాడ గ్రామానికి చెందిన కంభపు రాంబాబును రెండవ సారి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదేశాల ఉవచ్ఛాయని రాంబాబు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పామర్రు నియోజకవర్గ శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ ఆశీస్సులతో రెండో సారి డైరెక్టర్‌గా ఎంపికైన రాంబాబును పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభినందనలు తెలిపారు.

మాజీ సర్పంచి మృతికి నివాళి



పాప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కైలే జ్ఞానమణి తదితరులు

భట్లపెనుమర్రు (మొవ్వ): కూచిపూడి పీఏసీఎస్ డైరెక్టరు, భట్లపెనుమర్రు మాజీ సర్పంచ్ దొప్పలపూడి పాప భౌతిక కాయానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి శనివారం నివాళులర్పించారు. అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన పాప కుటుంబాన్ని ఆమె పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కైలే జ్ఞానమనితో పాటు మొవ్వ ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర, మాజీ సర్పంచ్ కొడాలి దయాకర్, దళిత జేఏసీ నాయకులు గండ్రపు శీనయ్య, నడకుదురు రాజేంద్ర, కొండేటి చందు, కే సుధాకర్, కే నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాఘమాస నవరాత్రులు

కైకలూరు: మాఘ మాస ప్రారంభ సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో నవరాత్రుల వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభమతాయని ఆలయ ఈవో వీఎన్‌కే. శేఖర్ శనివారం చెప్పారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. మొదటి రోజు అమ్మవారికి ఆలయ చైర్మన్ గుర్రం రాంబాబు దంపతులు పుష్పాలంకరణ చేయించి భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందిస్తారని ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించానలి కోరారు.

సమన్వయంతోనే గృహ నిర్మాణాల్లో పురోగతి



ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న జయరామాచారి

గుడివాడరూరల్: పేదలందరికీ ఇళ్లు నిర్మాణ కార్యక్రమం అనేది అన్ని శాఖల సమన్వయంతోనే సాధ్యపడుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ హెడ్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జయరామాచారి పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాయపాలెం జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి గూడు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశం చేసే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. గూడు లేని ప్రతి ఒక్కరూ సొంతింట్లో ఉండాలనే సీఎం ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందజేసే మెటీరియల్ నిల్వ చేసిన గుడివాడ మార్కెట్ యార్డ్ గోడౌన్‌ను సందర్శించారు. మెటీరియల్ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (మచిలీపట్నం) రమేష్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (గుడివాడ) రామోజీనాయక్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు, హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న వైవీ మురళీకృష్ణ

గుడివాడటౌన్: పట్టణంలోని డివైడర్లు, ఇతర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని భవిష్యత్ భద్రతాదళం సంస్థ కన్వీనర్ వైవీ మురళీకృష్ణ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వీ మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఇతర దేశాల్లో మంగ్రూవ్ జాతికి చెందిన ఈ మొక్కలను నిషేధించారన్నారు. వీటి పిప్పాడి మనుషుల శ్వాసకోశాల్లో చేరితే వ్యాధులు వస్తాయని అనేక మంది శాస్త్రవేత్తలు నిరూపించారని, ఈచెట్లపై పక్షులు వాలవని ఇది పూర్తిగా కార్బోమోనాక్సైడ్ వాయువును విడుదల చేస్తున్నందువలన వాతావరణంలో కాలుష్యం కూడా ఏర్పడుతుందన్నారు. దీనిపై విచారించి మొక్కలు తొలగించి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాలని ఆయన కోరారు. పరిశీలించి స్పందిస్తామని కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశపుహాల్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నియమించిన కస్టోడియన్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు లారీల్లో తరలించినప్పుడు వెంటనే దిగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు మిల్లర్లతో సంప్రదించకుండా కస్టోడియన్ అధికారులు చూడాలని చెప్పారు. ఆర్బీకేల్లో పరిశీలించిన నాణ్యత, ప్రమాణాలే ఫైనల్‌గా ఉంటాయన్నారు. రైస్‌మిల్లుల్లో నాణ్యత, ప్రమాణాలు వ్యత్యాసం వస్తే కస్టోడియన్ అధికారి సమక్షంలో మరలా పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం మిల్లులకు చేరిన వెంటనే గోనెసంచులను సేకరించి తిరిగి వాటిని ఆర్బీకేలకు తరలించేలా చూడాలని చెప్పారు. గోనెసంచులు లేవనే మాట రాకుండా రైతులకు ఎప్పటికప్పుడు సరఫరా చేసేలా చూడాలన్నారు. ట్రక్ షీట్ జనరేట్ చేయించటం తదితర అంశాలను నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్, డీఎస్‌ఓ వి. పార్వతి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి (మచిలీపట్నం): కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మికులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు రావాల్సిన పరిహారం అందకపోతే తమ సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని చెప్పారు. గతంలో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా వేతనాలు ఇచ్చేవారని, తరువాత సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా కనీస వేతన చట్టం తీసుకువచ్చారని వివరించారు. పనిచేసే ప్రదేశంలో మహిళా కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాది చీలి ముసలయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్. గోవిందు, ఏఎస్‌ఐ సాంబశివ రావు, జయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో లిఫ్టు నిర్మాణ పనుల పరిశీలన



లిఫ్ట్ పనితీరు పరిశీలిస్తున్న నారాయణరెడ్డి

గుడివాడటౌన్: పేదవానికి మెరుగైన వైద్యం అందాలనే లక్ష్యంతో పని చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గతంతో పోల్చుకుంటే ఆస్పత్రులు అన్ని హంగులతో సేవలకు అందుబాటులోకి వస్తున్నాయని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. ఏరియా ఆసుపత్రిలో శనివారం నూతనంగా ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సాంకేతికంగా నిర్మాణం పూర్తయిందని సోమవారం ట్రయిల్‌రన్ వేస్తామన్నారు. బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి చొరవతో ఈ లిఫ్ట్ ఏర్పాటు చేశామన్నారు. కెనరా బ్యాంక్ సేవా నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేయించగా ఎంపీ నిధులు రూ.10 లక్షలు అందజేశారన్నారు. దీంతో మొత్తం రూ.35 లక్షలతో ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఐదంస్తుల భవనంలో లిఫ్ట్ వసతి లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడేవారని ఇకపై ఆ కష్టాలు తొలగిపోతాయని నాయణరెడ్డి అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి తదితరులు ఆమన వెంట ఉన్నారు.

ఆలయాల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి



ముదినేపల్లిలో ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కార్యనిర్వాహక ఇంజినీర్ భాస్కర్

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. నియోజకవర్గంలోని వెనుకబడని ప్రాంతాల్లో తిరుమల తిరుమతి దేవస్థానం నిధులతో ఆలయాలను నిర్మించేందుకు 12 ఆలయాల నిర్మాణానికిగాను ఒకొక్క ఆలయానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఈ నిధులతో నిర్మిస్తున్న ఆలయాలను ద్వారకాతిరుమల కార్యనిర్వాహక ఇంజినీర్ భాస్కర్, గుడివాడ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ కలిదిండి గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. అనంతరం ముదినేపల్లిలో ఎమ్మెల్యేను కలిసి పనుల పురోగతిపై వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి 12 ఆలయాలు టీటీడీ మంజూరు చేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ ఆలయాల నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని, మరికొన్ని ఆలయాల నిర్మాణాలకు ప్రతిప్రాదనలు తయారుచేయాలని సూచించారు.

రికార్డులు పరిశీలించిన స.హ.చట్టం కార్యకర్తలు



ఐలూరులో పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

తోట్లవల్లూరు: ఐలూరు గ్రామ పంచాయతీ రికార్డులను అధికారుల అనుమతితో స.హ. చట్టం కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ శనివారం తనిఖీ చేశారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో రికార్డులు పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరిగినట్లుగా గుర్తించటంతోపాటు 2018 నుంచి ఆడిట్ రిపోర్టులు లేవన్నారు. పంచాయతీలో టెండర్ పోస్టులు కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకే ఉండాలని, కానీ అవి నిబంధనల ప్రకారం జరగలేదని, నగదు చెల్లింపులు, రికార్డుల నిర్వహణలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నిధుల దుర్వినియోగం అంశంపై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్ పి.సుజాత, ఈఓపీఆర్‌డీ రవికాంత్, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్, స.హ. చట్టం కార్యకర్తలు గౌతమి, సురేష్ పాల్గొన్నారు.

బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ సాయిప్రసన్న, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి

తోట్లవల్లూరు: పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో కిషోర బాలికలలో రక్తహీనత నివారణపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ సాయిప్రసన్న మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రతి గురువారం ఆరోగ్య సిబ్బంది ఇచ్చే ఐఎఫ్‌ఏ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణపై మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అవగాహన కలిగించనున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయండి

డీఎల్‌పీఓ సంపతకుమారి



గరికపర్రులో ఇంటి పన్ను వసూలుపై ఆరా తీస్తున్న డీఎల్‌పీఓ సంపతకుమారి

తోట్లవల్లూరు: సంపద కేంద్రాల నిర్వహణ బాగుందని ఉయ్యూరు ఇన్‌చార్జి డీఎల్‌పీఓ జి.సంపతకుమారి అన్నారు. మండలంలోని గరికపర్రు, కనకవల్లి గ్రామాలలోని సంపద కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. వానపాముల ఎరువు తయారీ విధానాన్ని సంపతకుమారి పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గరికపర్రు గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష చేశారు. ఇంటి పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు పూర్ణేశ్వరి, పిచ్చియ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

మండవల్లి: జాతీయ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా నిర్వహిస్తుండటంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు శనివారం కార్యదర్శి టి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గ్రామ పంచాయతీ, సంబంధిత శాఖల అధికారులు లేకుండా కాంట్రాక్టర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారని, దీంతో పైప్‌లైన్లు, నీటికుళాయిలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. గ్రామస్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఐక్య వేదిక మండల కార్యవర్గ సభ్యుడు ఎల్‌ఎస్ భాస్కరరావు, టీ అప్పారావు, సీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీ సత్యనారాయణ, బీ వెంకయ్య, బాలాజీ, శ్రీనివాసరావు వినతిపత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

భారీ వాహన డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం..

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆర్టీసీ డిపోలోని భారీ వాహన డ్రైవింగ్ శిక్షణ పొందగోరు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని డీఎం పెద్దిరాజు తెలిపారు. 16వ బ్యాచ్ డ్రైవర్ శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. శిక్షణ పొందగోరు అభ్యర్థులు పనిదినాల్లో డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్: 99592 25462, 73829 03240 నెంబర్లను సంప్రదించాలని కోరారు.